క్లుప్తంగా

పర్యటనకు ఆహ్వానం లేదు..

అశ్వాపురం: మండలంలో గొందిగూడెంలో ఇసుకవాగుపై వంతెనకు రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన కార్యక్రమానికి స్థానిక సర్పంచ్‌గా తనను ఆహ్వానించకపోవడం బాధాకరమని గొందిగూడెం సర్పంచ్ పాయం భద్రమ్మ అన్నారు. సోమవారం ఆమె సాక్షితో మాట్లాడుతూ.. గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ఏ అధికారి నుంచి తనకు కనీస ఆహ్వానం లేదన్నారు. తాను, ఎంపీటీసీ, ఉపసర్పంచ్ హాజరుకాలేదన్నారు. ఇసుకవాగుపై వంతెన మాకు చిరకాల కోరిక అని వంతెన కోసం గిరిజనుల పక్షాన ఎన్నో ఏళ్లుగా అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, కలెక్టర్లు, ఐటీడీఏ పీఓల చుట్టూ తిరిగి గిరిజనుల బాధలు మొరపెట్టుకున్నానన్నారు.

టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యుడు మునిగడప రామాచారి టీపీటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. భారత స్వతంత్ర పోరాటాల స్ఫూర్తితో 1994లో ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పాడిందన్నారు. అనంతరం రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్)గా ఆవిర్భవించి తొమ్మిదేళ్లు పూర్తి అయిందని తెలిపారు. టీపీటీఎఫ్ సమాజ శ్రేయస్సు, విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం ప్రధాన లక్ష్యాలుగా కామన్ స్కూల్ సిస్టం కోసం నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.రాజు, కె.ముత్తమ్మ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

మణుగూరురూరల్: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మణుగూరు భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఎదుట ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులు సోమవారం నుంచి నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లేబర్‌యాక్ట్ ప్రకారం తమకు జీతాలు చెల్లించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వీరి సమ్మెకు కాంగ్రెస్ నాయకులు కాటిబోయిన నాగేశ్వరరావు, బీరం సుధాకర్ రెడ్డి, పీరినాకి నవీన్, కె.సత్యనారాయణ, లతీఫ్, కె.లాలు, కల్యాణ్, సమ్మయ్య, నాగరాజు, బీజేపీ నాయకులు, పున్నం బిక్షపతి, లింగంపల్లి రమేష్, బీర రమేష్, తార ప్రసాద్, మున్నా మద్దతు తెలిపారు.

డ్రైయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారికి ఇరువైపులా రూ.కోటి నిధులతో డ్రైయినేజీ నిర్మాణానికి సోమవారం సర్పంచ్ మర్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో డ్రైయినేజీకి నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. ప్రజల పక్షాన ఎమ్మెల్యే రేగాకు కృతజ్ఞతలు తెలిపారు. డ్రైయినేజీ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చొరవ తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుధీర్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రామగిరి భాస్కర్, భిక్షంరెడ్డి, రామారావు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

అన్నపురెడ్డిపల్లి: పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గుంపెన సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని గుంపెన ప్రాథమిక సహకార సంఘంలో సోమవారం పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీలుగుల వల్ల భూసారం పెరుగుతుందని, పచ్చిరొట్ట వలన మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల రైతుబంధు కన్వీనర్ భీంరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏఓ అనూష, సీఈఓ సున్నం వెంకటేశ్వర్లు, ఏఈఓలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో కూనవరం గ్రామానికి చెందిన బుద్దరాజు నవీన్‌బాబు సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నవీన్‌బాబుకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఖమ్మం డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సొసైటి చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

దుమ్ముగూడెం: ఎండలు విపరీతంగా కొడుతున్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు లక్ష్మీనగరం గ్రామంలోని నటరాజ్ సూపర్ మార్కెట్ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని ప్రతి గ్రామం నుంచి లక్ష్మీనగరం గ్రామానికి బ్యాంక్, ప్రభుత్వ కార్యాలయాలకు పనుల మీద ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో.. సూపర్ మార్కెట్ యజమాని వాకచర్ల గౌరి శంకర్–సుధారాణి దంపతులు, కుమారుడు శ్రీకాంత్‌లు మజ్జిగ పంపిణీ చేశారు.

గిరిజన అభివృద్ధికి పెద్దపీట

- దేశానికి ఆదర్శంగా తెలంగాణ
- పినపాక నియోజకవర్గ పర్యటనలో మంత్రి అజయ్
- రూ.కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అశ్వాపురం: గొందిగూడెంలో ఇసుకవాగుపై హెలెవల్ వంతెనకు శంకుస్థాపన చేస్తూ..



బూర్గంపాడు: లక్ష్మీపురంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పువ్వాడ తదితరులు

బూర్గంపాడు: గిరిజన ప్రాంతాల సమగ్రాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని లక్ష్మీపురం నుంచి టేకులచెరువు వరకు రూ 3.87 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలలో మౌలికవసతుల కల్పనకు ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో పినపాక నియోజకవర్గం అభివృద్ధిలో ముందువరుసలో నిలుస్తుందన్నారు. అనునిత్యం ప్రజల కోసం పరితపించే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో భద్రాచలం ఐటీడీఏ పీఓ గౌతమ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా గంథ్రాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, సర్పంచ్‌లు సొంపాక నాగమణి, భూక్యా సుజాత, భూక్యా శ్రావణి, ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించబోయే ఆర్‌టీవో కార్యాలయ నిర్మాణ పనులకు, అంబేడ్కర్ సెంటర్ నుంచి కోడిపుంజుల వాగు వరకు ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారిని ఇరువైపులా సుమారు రూ.2.60కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు, అంబేడ్కర్ సెంటర్ నుంచి చినరావిగూడెం మీదుగా నెల్లిపాక వరకు సుమారు రూ.2కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ పనులకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావులు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఖమ్మం డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సర్పంచ్‌లు బచ్చలభారతి, కారం ముత్తయ్య, సొసైటి చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్‌ఎస్ నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, ఎంపీటీసీలు కణతిబాబరావు, గుడిపూడికోటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాకలో రాళ్ల వాగుపై రూ.1.80 కోట్లతో వంతెనకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావులు సోమవారం శంకుస్థాపన చేశారు. తుమ్మలచెరువు గ్రామంలో లోతువాగుపై రూ.5కోట్లతో వంతెన నిర్మాణానికి, గొందిగూడెం గ్రామంలో ఇసుకవాగుపై రూ.7 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గొందిగూడెంలో ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో కోట్ల రూపాయల నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తున్న రేగా కాంతారావును మంత్రి అభినందించారు.

పొంగులేటి, పాయంలు చేసిన అభివృద్ధేంటో చెప్పాలి..

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాకు పొంగులేటి, పినపాకకు పాయం వెంకటేశ్వర్లు ఏం చేశారో ప్రజలకు చెప్పాలని అన్నారు. రాళ్లవాగు, లోతువాగు, ఇసుకవాగులపై వంతెనలు పాయం తన హయాంలో ఎందుకు తేలేదో తేల్చాలన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా అశ్వాపురం మండలంలో సాగునీరు అందించేందుకు ప్రత్యేకంగా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం సీఎం కేసీఆర్‌తో మాట్లాడి మంజూరు చేయించానన్నారు. గతంలో గుక్కెడు నీరు ఇవ్వలేని వారు ఇప్పుడు ఏదో చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, సర్పంచ్‌లు బండ్ల సంధ్యారాణి, పర్శిక సూరిబాబు, కలేటి నరసింహారావు, ఏనిక స్వరూప, గొర్రెముచ్చు వెంకటరమణ, మర్రి మల్లారెడ్డి, ఎంపీటీసీ తాటి పూజిత, గాదె జయ, వైస్ ఎంపీపీ వీరభద్రం, తహసీల్దార్ ఎం.ఏ.రాజు, అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం

మండలంలో పర్యటనలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావులు సోమవారం ఆనందాపురం గ్రామంలో జెడ్పీటీసీ నివాసంలో తేనిటి విందుకు హాజరయ్యారు. తమ నివాసానికి వచ్చిన మంత్రి పువ్వాడ, ఎమ్మెల్యే రేగాను జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, గోపాలకృష్ణారెడ్డి దంపతులు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ అధ్యక్షుడు కందుల కృష్ణార్జున్‌రావు, యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందేలా కృషి



అశ్వారావుపేటరూరల్: మల్లాయిగూడెంలో బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్: అకాల గాలి బీభత్సంతో నష్టపోయిన, ధ్వంసమైన ఇళ్లకు, క్షతగాత్రులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మల్లాయిగూడెం గ్రామంలో ఆయన సోమవారం పర్యటించి గాలి దుమారంతో దెబ్బతిన్న ఇళ్లు, నేలమట్టమైన పూరిల్లు, పొగాకు బ్యారన్, రేకుల షెడ్లు, కరెంట్ స్తంభాలను పరిశీలించారు. అలాగే పొగాకు బ్యారన్ కూలిపోయి స్వల్పంగా గాయపడిన ఇద్దరు గ్రామస్తులను పరామర్శించి వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందించారు. కాగా పూరిల్లు కూలిపోయిన బాధితులు ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. దాంతో ఎమ్మెల్యే త్వరలో ప్రభుత్వం అమలు చేసే గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షల వ్యయంతో ఇళ్లు మంజూరు చేసేలా కృషి చేస్తానని అన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ లూథర్ విల్సన్‌ను నష్టంపై తక్షణమే అంచనాలు వేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొంతమంది గ్రామస్తులు మల్లాయిగూడెం నుంచి అనంతారం గ్రామానికి బీటీ రహదారి మంజూరు చేయించాలని కోరగా, అక్కడి నుంచే ఐటీడీఏ ఏఈ ప్రసాద్‌కు ఫోన్ చేసి బీటీ రహదారికి అంచనాలు వేసి, ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కొద్ది రోజుల్లోనే ఐటీడీఏ పీఓతో మాట్లాడి..బీటీ రోడ్డు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సర్పంచ్ నారం రాజశేఖర్, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, సీహెచ్ వెంకటనరసింహా, జుజ్జూరి వెంకన్న పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజాపంథా నాయకులు

చర్ల: మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చర్లలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరిన ప్రజలు తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి కొండా చరణ్ మాట్లాడుతూ.. ఇంటి స్థలం లేని గిరిజనులు, దళితులు, పేదలకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని, అర్హులైన వారందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేయాలని అన్నారు. అనంతరం తహసీల్దార్ బి.భరణిబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాలెం చుక్కయ్య, నాగరాజు, బాబూరావు, కల్లూరి కృష్ణ, రాజు, బొర్రయ్య, నాగేశ్వరరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నిర్వహిస్తున్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రావలసిన 21 నెలల బకాయి వేతనాలు, మూడున్నర నెలల డైలీ వేజ్ వర్కర్ల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయంలో పీఓకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన పీవో సంబంధిత సెక్షన్ అధికారులను పిలిచి తక్షణం వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం డైలీవేజ్ వర్కర్లుగా పని చేస్తూ మరణించిన కార్మికుల వారసులకు డైలీ వేజ్ వర్కర్‌గా లేదా ఐటీడీఏ పర్యవేక్షణలో నడుస్తున్న గురుకులాలు ఏకలవ్య పాఠశాలల్లో వర్కర్లుగా నియమించాలని సీఐటీయూ కోరింది. వినతిపత్రం అందజేసిన వారిలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, యూనియన్ జిల్లా నాయకులు రామ జలంధర్, సీఐటీయూ పట్టణ నాయకులు ఉన్నారు.

నిధుల మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

గుండాల: గత కొంత కాలంగా గుండాల జీసీసీ బంక్ వద్ద పెట్రోల్, డీజిల్ కొరతపై అనేక ఆందోళన నడుమ స్పందించిన ఐటీడీఏ పీఓ.. నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఎంపీపీ ముక్తి సత్యంలు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా స్థానిక జీసీసీ బంక్ వద్ద పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడగా న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో పలు ఆందోళన చేపట్టినట్లు, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. స్పందించిన అధికారులు రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు, తమ పార్టీ తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సర్పంచ్ కొరం సీతారాములు, ఉప సర్పంచ్ మానాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

అశ్వారావుపేటరూరల్: అకాల గాలి దుమారంతో నష్టపోయిన బాధితులు, ఇళ్లకు తక్షణమే నష్టపరిహారాన్ని అందించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్లాయిగూడెం గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించి, బాధితులను పరామర్శించారు. గాలి బీభత్సానికి నేలమట్టమైన పూరిల్లు, రేకుల షెడ్లు, పొగాకు బ్యారన్, పామాయిల్ చెట్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని, నష్టపోయిన బాధితులందరికీ పరిహారాన్ని ఇవ్వాలని కోరారు. బి.చిరంజీవి, మడిపల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఎంపీడీఓకు వినతి

పినపాక: పీఆర్సీ నివేదిక ప్రకారం పంచాయతీ కార్మికులకు కనీస వేతనంగా రూ.19 వేలు చెల్లించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఆర్.మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, కనీస వేతనం అందించాలని, జీతాలు ప్రతి నెలా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బ్రిడ్జి పనులు చేపట్టాలి

గుండాల: మామకన్ను–ఆళ్లపల్లి మధ్య కిన్నెరసానిపై బ్రిడ్జి పనులు వెంటనే పూర్తి చేయాలని ఆల్లపల్లి వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌డేలో వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. మూడేళ్ల క్రితం నిధులు మంజూరు కాగా అటవీశాఖ అధికారులు అనుమతి లేదంటూ పనులను నిలిపివేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ చొరవ తీసుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొమ్మ శ్రీను, బూరుగడ్డ నాగేశ్వరరావు, మద్దెల వెంకటేశ్వర్లు, అరెం వెంకన్న, పంజాల తిరుపతి, ఖాదర్ పాషా, పూసం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధిహామీ’ని కాపాడుకోవాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

దుమ్ముగూడెం: ఉపాధి హామీ పథకాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు మచ్చా వెంకటేశ్వర్లు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలవంశి వంశీకృష్ణ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారం పుల్లయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని లచ్చిగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, రైతు సంఘం.వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో ఉన్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనుల్లో ఎదురవుతున్న పలు సమస్యలు, కొరవడిన సౌకర్యాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మర్మం చంద్రయ్య, మాజీ సర్పంచ్ సోడి అర్జున్, రైతు సంఘం నాయకులు పెనుబల్లి ప్రసాద్, అర్జున్, శ్రీరామ్, శ్రీరాములు, ఇరప్ప రామక్క, కుంజ సరోజిని, శీలం రమేష్, కృష్ణమూర్తి, కారం మల్లేష్, భద్రమ్మ ,సుజాత, తిరుపతమ్మ, చలపతి, సొంది రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు



అశ్వారావుపేటరూరల్: మల్లాయిగూడెంలో కొత్త స్తంభాలు వేస్తున్న విద్యుత్ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మల్లాయిగూడెం, నారంవారిగూడెం, అశ్వారావుపేటలో సోమవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు. అకాల గాలి దుమారంతో ఆయా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, వైర్లు తెగి పడిన సంగతి తెసిందే. దాంతో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన విరిగిపోయిన కరెంటు స్తంభాలను తొలగించి, కొత్త స్తంభాలు వేశారు. తెగిపోయిన వైర్లను సరి చేస్తున్నారు. త్వరతగతిన పునరుద్ధరణ పనులు పూర్తి చేసి, విద్యుత్ సరఫరాను అందించేలా కృషి చేస్తున్నట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ శివ, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పొంగులేటి యాత్రలు అర్థరహితం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరికెల తిరుపతిరావు

భద్రాచలం: గిరిజనులకు ప్రభుత్వం ఒక వైపు పోడు భూముల హక్కు పత్రాలను ఇచ్చే ప్రక్రియను ప్రారంభించనున్న నేపథ్యంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేపట్టే పాదయాత్రలు, నిరసన కార్యక్రమాలు అర్థరహితమని టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అరికెల తిరుపతిరావు అన్నారు. సోమవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పొంగులేటి స్వలాభాపేక్షతో గిరిజనులను తికమక పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ జూన్ 24 నుంచి పోడు భూముల హక్కుదారులకు పట్టాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి కొండిశెట్టి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు చింతాడ చిట్టిబాబు, నాయకులు తాళ్ల రవికుమార్, చాట్ల రవికుమార్‌లు పాల్గొన్నారు.

పొంగులేటిని విమర్శించే స్థాయి లేదు

పినపాక: పొంగులేటిని విమర్శించే స్థాయి బీఆర్‌ఎస్‌కు లేదని, స్థాయిని మరిచి ఆ పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని పొంగులేటి అభిమాన నాయకులు విమర్శించారు.

ఈ మేరకు సోమవారం బయ్యారం క్రాస్‌రోడ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు పొంగులేటిపై విమర్శలు మానుకుని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఎన్నికల సమీపిస్తున్నాడంతో ఓటమి భయంతో పోడుపట్టాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు అంటూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో పొంగులేటి సైన్యం కొమరం రాములు, ఉడుముల రవీందర్ రెడ్డి, సమ్మయ్య, తాటి బాలకృష్ణ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఓటూ జీఎం లలిత్‌కుమార్

మణుగూరురూరల్: బాలబాలికలు చదువులో రాణిస్తూ.. క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఎస్‌ఓటు జీఎం డి.లలిత్‌కుమార్ సూచించారు. సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో భద్రాద్రి స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమానికి ఎస్‌ఓటు జీఎం లలిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల వల్ల పిల్లల్లో చురుకుదనం, పట్టుదల, ఉత్సాహం పెరుగుతుందన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా వివిధ రకాల క్రీడాపోటీలు నిర్వహిస్తూ యాజమాన్యం పిల్లలను ప్రోత్సహిస్తోందన్నారు. తల్లిదండ్రులు కూడా క్రీడల పట్ల ఆసక్తి పెరిగేలా పిల్లలను ప్రోత్సహించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం శిక్షణ పొందిన బాలబాలికలకు సర్టిఫికెట్లతో పాటు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి వి.రామేశ్వరరావు, స్పోర్ట్స్ అసిస్టెంట్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

దమ్మపేట: ట్రాక్టర్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మందలపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట వైపు వెళ్తున్న లారీ ఎదురుగా జామాయిల్ కర్రల లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను మందలపల్లి గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న కర్రలు డ్రైవర్ తన్నీరు రాజేశ్ (27)పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజేశ్ భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల ప్రాంతానికి చెందిన వ్యక్తి కాగా ఐదేళ్ల నుంచి దమ్మపేట గ్రామంలో తన అత్త ఇంటి వద్ద ఉండి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

దమ్మపేట: పురుగులమందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం కివ్వాక గ్రామానికి చెందిన కొక్కరగడ్డ ప్రసాద్ (23) తన తండ్రి నివసిస్తున్న దమ్మపేట మండలంలోని పూసుకుంట గ్రామానికి కొద్ది రోజుల కిందట వచ్చాడు. ప్రేమలో విఫలం కావడంతో మనస్తాపానికి గురై ఆదివారం సాయంత్రం సమయంలో పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఖమ్మం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఆనంద్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు స్వాధీనం

దుమ్ముగూడెం: అక్రమంగా 3 వాహనాల్లో తరలిస్తున్న పశువులను స్వాధీనం చేసుకుని పాల్వంచ గోశాలకు తరలించినట్లు సీఐ దోమల రమేశ్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎస్సై కేశవరావు సిబ్బందితో లక్ష్మీనగరం గ్రామంలో ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో మూడు వాహనాల్లో 27 పశువులను తరలిస్తుండగా పోలీసులు ఆపారు.

అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాలు పోలీస్ స్టేషన్‌కు తరలించి పశువులను పాల్వంచ గోశాలకు తరలించారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారయ్యారని, మొత్తం 10 మందిపై కేసు నమోదు చేశామని, నిందితులంతా వరంగల్ జిల్లావాసులని సీఐ వివరించారు. గోశాలకు తరలించిన వాటిలో 11 ఎద్దులు, 16 ఆవులున్నాయి. ఈ మేరకు సీఐ దోమల రమేశ్ వివరాలు వెల్లడించారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గారాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
యస్.రవిబాబు - 99516 02914
కె. మధు - 97059 44416
ఎన్. శేషయ్య - 99121 99148